

# ప్రశ్న

సత్యం శంకరమంచి

కుండవత్తయ్యా. అమ్మా నాన్నా ఇవ్వాళ కాకపోతే రేపైనా రావలసిన వాళ్ళే' అంది లలిత.

లలితను చూస్తుంటే సూర్యానికి బాధేసింది. లలిత ఏమీ జరగనట్లు మాట్లాడుతున్నా, శాంతతో కలుపుగోలుగా కబుర్లు చెప్తున్నా, చిట్టాణ్ణి దగ్గరికి తీసుకుని 'పిన్నమ్మా! పిన్నమ్మా'అని పిలి పించుకుంటున్నా తను చేసిన అన్యాయాన్ని ఎత్తి చూపిస్తున్నట్లుంది

సూర్యం, లలిత గదిలో కూర్చుని మాట్లాడు కుంటున్నారు. లలిత ఇక్కడికి వస్తున్నట్లు వాళ్ళ అమ్మానాన్నకి తె యదట. కాలేజి ఎక్స్‌కర్షన్ పార్టీతో వచ్చి చూసిపోదాంగదా అని ఇక్కడ దిగిం దట. లలిత చకచకా కబుర్లు చెప్తోంది. వాళ్ళ కాలేజి సంగతులు, ఎక్స్‌కర్షన్ వింతలు, రైలు ప్రయాణంలో తిండిలేక పోవటం, స్టేషన్‌లో కొందరు తప్పిపోవటం, గొలుసు లాగటం, ఏవేవో చెప్తోంది. లలితలో ఇదివరకటి చలాకీతనం అలాగే వుంది కబుర్ల పోగు మారలేదు అనుకున్నాడు సూర్యం. మధ్యలో మాటలు ఆపి లలిత అంది 'ఏవిటి బావా! అట్లా మూగిలాగ కూర్చున్నావ్? శాంతక్క నిన్ను చాలా మార్చేసింది!'

సూర్యం వెర్రి నవ్వొకటి నవ్వి 'అబ్బే! ఏంలేదు నువ్వు చెప్తున్నావు గదా అని వింటున్నాను' అన్నాడు.

'సరే అయితే నే చెప్పటం అయిపోయింది నువ్వు మొదలెట్టు'.

సూర్యం కొంతసేపు మాట్లాడలేదు ఆ తర్వాత అన్నాడు 'నువ్వు పెళ్ళెప్పుడు చేసు కుంటావ్?'

లలిత నవ్వుముఖం క్షణంలో మారిపోయింది అంతలో తిరిగి నవ్వు తెచ్చుకుని 'నాకేవయినా మంచి సంబంధం చూస్తున్నావా?' అంది.

లలిత నవ్వుతోందే కాని దాని వెనకాల ఎంత విషాదం ఉందో సూర్యానికి తెలుస్తూనే ఉంది నాకింత వయసు వచ్చినా పెళ్ళికాక పోవడానికి, అవ సరం లేకపోయినా ఉద్యోగం చేస్తూ జీవితం గడపడానికి కారణం నువ్వు—నువ్వు అని చెప్తున్న ట్లుంది.

# ప్రశ్న

'లలితా! నీకు అన్యాయం చేశాను' ఈభావాన్ని ఎప్పుడు లలిత ముందు పరిచేద్దామా అన్నంత తొందరగా వచ్చాయి మాటలు.

లలిత రెండు క్షణాలు మాట్లాడలేదు. ఆ తర్వాత నిట్టూర్చి అంది. 'ఎందుకు బావా ఇప్పుడ దంతా తవ్వుకోటం? అయిందేదో అయిపోయింది ఆనాడు మనమూ పెద్దవాళ్ళ కొంగులు పట్టు కునే తిరిగాం మనకీ నోరు లేకపోయింది. వొలికి పోయిన పాలను గురించే చింతిస్తూ కూర్చోలేంగా శాంతక్క చాలా తెలివైంది నువ్వు అదృష్ట వంతుడివే నువ్వు పోగొట్టుకున్న దేంలేదు నాకదే సంతోషంగా ఉంది'.

సూర్యం విస్తుపోయాడు లలిత తనకుమించి పెరిగి పోయినట్లనిపించింది జీవితం గురించి తనకే ఇంత స్పష్టమయిన అభిప్రాయాలు లేవు తను పోగొట్టుకున్నదేవీ లేదంది. నిజమే మరి లలిత?

'నువ్వు ఎన్ని చెప్పినా నువ్వు నష్టపోయిన మాట మాత్రం నిజం, లలితా!'

'అలా అనుకోడానికి ఇంకా టైంవుంది నే నొప్పుకుంటే మాకో లెక్చరరు నన్ను పెళ్ళాడ్డానికి సిద్ధంగా ఉన్నాడు' లలిత పెదవులు సిగ్గుతో వొంపులు తిరిగాయి

సూర్యం మనసు తేలికైంది లలిత పెదవుల మీద ఇంకా చిరునవ్వు తుళ్ళి పడుతూనే ఉంది సిగ్గుతో ఆకళ్ళు సూటిగా చూడలేక పోతున్నాయి సూర్యాని కిప్పుడు పసిపిల్లలా కన్పించింది. లలిత నవ్వింది సూర్యం నవ్వాడు

శాంత కాఫీ తీసు కొచ్చింది శాంతగదిలో అడుగు పెట్టేసరికి సూర్యం లలిత ఇద్దరూ మాట్లాడటం లేదు ఇద్దరూ చిరునవ్వులంది పుచ్చుకుంటున్నట్లున్నారు

కాఫీ తీసుకుని 'నువ్వు కూడా తెచ్చుకో' అన్నాడు సూర్యం.

'లేదు. ఇంకా మావయ్యకీ వాళ్ళకీ ఇవ్వాలి' అని శాంత వెళ్ళిపోయింది

లలిత ఇంకోరోజు ఉండమన్నా ఉండలేదు. మళ్ళీ ఎక్స్‌కర్షన్ పార్టీని కలవాలట వెళ్ళేముందు గంటసేపు చిట్టాడు పిన్నమ్మని వదలలేదు లలిత వాణ్ణి దింపలేదు సూర్యం లలితని బస్సెక్కించి వచ్చాడు సూర్యం మనసులో బరువు దిగిపోయింది. రాత్రి పడుకుని సూర్యం అదే ఆలోచిస్తున్నాడు. తనకూ లలితకీ మధ్యనున్న అగాధం ఈ జీవితంలో పూడదనుకున్నాడు ఇంత తేలిగ్గా అదృశ్యమయి పోతుందనుకోలేదు లలితని తలుచుకుంటే చెప్ప లేని జాలి వేసింది మనసు ఆర్ద్రమై పోయింది. సూర్యానికి నిద్ర పట్టలేదు పన్నెండవుతోంది. మంచినీళ్ళు తాగి వచ్చాడు పక్క మంచం మీద శాంత శాంత తన శాంత సూర్యం మనసులో పరవళ్ళు తొక్కుతున్న కరుణ, జాలి, అభిమానం ఇప్పుడు ఏక ముఖంగా శాంత వైపు ప్రవహిం చాయి. శాంతని ఒక్కసారి దగ్గరకు తీసుకోందా మనిపించింది. 'శాంతా!' మృదువుగా తట్టి లేపాడు.

శాంత ఇటు తిరిగింది శాంత కన్నుల్లో అశ్రు ధారలు.

సూర్యం తలకిందయ్యాడు 'ఏవిటి శాంతా .. ఏవిటిది!'

శాంత సమాధానం చెప్పలేదు లోపల దుఃఖం పొర్లుకొస్తోంది రెండు చేతుల్తో సూర్యాన్ని కౌగి లించుకుంది సూర్యానికి బోధపడలేదు "ఏం జరి గింది శాంతా . ఏవిటిది ?" శాంత జవాబు చెప్ప లేదు. సూర్యాన్ని మరింత గాఢంగా హత్తుకుంది.

సూర్యం కంగారుపడ్డాడు. 'చెప్పు శాంతా .. అమ్మ ఏవన్నా అందా ఇంకెవరేమన్నా అన్నారా ... పోనీ మీ యింటికి వెళ్ళాలనుందా ..'

'ఏంలేదు . ఏంలేదు' శాంత కళ్ళు తుడుచు కుని సూర్యం గుండెకు అతుక్కుపోయింది


లలితను చూసి అసూయ పడిందా . లేదు అలాంటి స్వభావం కాదు ఎంత సర్వస్వంగా చూసు కుంటున్నాడో ఆమెకు తెలుసు లలిత రాక ఏరకంగానూ దుఃఖకారణం కాదు మరి ఎందుకు ఏడుస్తోంది ? సూర్యం తల్లడిల్లిపోయాడు. 'నన్నెందుకు బాధపెడ్తావ్ నువ్వు కంట తడి పెడ్తే నేను చూడలేనని నీకు తెలుసు సంగ తేవిటో చెప్పవా '

శాంత కన్నీటికళ్ళు నవ్వాయి. కళ్ళు తుడుచు కుని "లేదు . . ఏం లేదు . . మీరు బాధ పడొద్దు .. పడుకోండి ఏంలేదు " సూర్యాన్ని నిద్రపుచ్చింది శాంత.

తెల్లవారి సూర్యం కౌగిలి విప్పుకుని శాంత లేస్తున్నప్పుడు మళ్ళీ అడిగాడు 'రాత్రి ఎందుకు ఏడ్చావ్ ?'

తొలి సూర్యకిరణంలాంటి చిరునవ్వుతో, వానలో తడిసి ఉదయాన విప్పారిన పువ్వుల్లాంటి తన కళ్ళు సూర్యం కళ్ళలోకి పెట్టి, మృదువుగా ముద్దుపెట్టుకుని బయటికి నడిచి వెళ్ళింది శాంత.

రామనాథం పదిరోజుల్నుంచి లేవటంలేదు. డాక్టరు రోజూ వచ్చి మందులిచ్చి పోతున్నాడు. జబ్బు ఫలానా అని తెలియదు "పెద్దతనం మరేం భయంలేదు" అన్నాడు డాక్టరు కాని, ఆయన రోజురోజుకీ నీరసించిపోతున్నాడు. భోజనం కూడా. శ్రీదేవమ్మ మంచం దగ్గరికే తీసుకెళ్తుంటే



ఆయన ముఖంలో రానురాను కళ తగ్గిపోతోంది.

ఒకరోజు సంజెదీపాలు పెట్టాక రామనాథం ఇంట్లో అందర్నీ పిలిచాడు. అంతా మంచంచుట్టూ చేరారు. చిట్టాణ్ణి దగ్గర కూర్చోపెట్టుకున్నాడు. సూర్యం తండ్రికి ఎదురుగా కూర్చున్నాడు. ఆయన గొంతులో ఉండే గాంభీర్యం కూడా తగ్గిపోతోంది. 'నాకు అరవైయేళ్లు వచ్చే మాఘమాసానికి నిండుతాయి' అన్నాడు.

శ్రీదేవమ్మ గొల్లుమంటూ కొంగు అడ్డం పెట్టుకుంది శ్రీదేవమ్మకు తెలును రామనాథం వెనక చెప్తూ ఉండేవాడు తన జాతకం ప్రకారం అరవయ్యో ఏట జీవితం చాలిస్తానని.

'ఎందుకే పిచ్చిదానా ఏడుస్తావ్ ! రత్నంలాంటి కొడుకును కన్నావ్. కూతుర్ని మంచి అయ్య చేతికి అప్పగించావు. నీ జన్మ తరించింది. మనవడు పుట్టాడు ఇంతవరకూ నువ్వు కష్టం అంటూ ఎరగవు. నీకే లోటూ లేకుండా జరిగిపోయింది. ఇకముందూ అట్లాగే జరుగుతుంది. నే చెప్తున్నా విను !'

'ఇప్పుడెందుకు నాన్నా ఆ మాటలన్నీ ...'

'ఇప్పుడు కాకపోతే ఇంకెప్పుడు చెప్పుకుంటారా ఇవన్నీ ' ఆయన ముఖంలో శుష్కమైన నవ్వు.

'బతికినన్నాళ్లూ హాయిగా బతికాను తృప్తిగా ఇంత తిన్నాను. ఇతరుల కింత పెట్టాను. నన్ను గురించి అంతా మంచిమాటే అన్నారు. కాని ఎవరి నోటంటా చెడుమాట వినలేదు. నీలాంటి కొడుకు ... లక్ష్మీదేవిలాంటి కోడలు .. ముత్యాల్లాంటి మనవడు ...' అంటూ చిట్టాడివైపు నవ్వుతూ చూశాడు. చిట్టాడు బిక్కమొహంతో తాతగారివైపే చూస్తున్నాడు.

'ఇవన్నీ ఇప్పుడెందుకు నాన్నా డాక్టరు జబ్బేమీ లేదన్నాడు. నాలుగు రోజుల్లో తగ్గిపోతుంది మీ రివన్నీ చెప్తే పిల్లలం మేమంతా కంగారు పడిపోమూ—'

రామనాథం మళ్లీ నవ్వాడు. 'కంగారెందుకు బాయనా ! పుట్టాక అంతా వెళ్లిపోవలసిందే. చెప్పొచ్చిందేమంటే దేవుడు నన్ను దయగా చూశాడు బతికినన్నాళ్లూ హాయిగా బతికాను. తృప్తిగా బతికాను. హాయిగా నవ్వుతూ వెళ్లిపోతాను నాకే విచారమూ లేదు. బతికుండగా నన్నింత సుఖపెట్టిన ఆ దేవుడు రమ్మని పిలిచి నప్పుడు నవ్వుతూ వెళ్లకపోతే బావుంటుందా ?'

సూర్యం గతుక్కుమన్నాడు. ఆ మాటలు శ్రుతి మించుతున్నాయి. కాని, ఆయన ముఖం చూస్తే ఏదో కాంతి కొట్టొచ్చినట్లు కన్పిస్తోంది ఆయన కళ్లు వెలుగుతున్నాయి ఆ మీసాల చాటున చిరునవ్వు మృత్యువుకు స్వాగతం చెప్తున్నట్లుంది. ఈ ప్రాపంచిక భవనం గడప దాటుతున్న మనిషిలా కన్పిస్తున్నా డాయన తండ్రిలో ఇంత సంయమనం, ఆ మాటలు, ముఖంలో ఆ దీప్తి సూర్యాన్ని బొమ్మని చేశాయి.

ఇంతలో డాక్టరు వచ్చాడు అంతా లేచారు. డాక్టరు చెయ్యిచూసి 'నిన్నటికంటె మెరుగు' అన్నాడు. ఇంజక్షన్ ఇచ్చి వెళ్తూ బిక్కమొహంతో నుంచున్న సూర్యాన్ని చూసి 'అదేవిటోయ్ అంత కంగారు పడాల్సిందేమీ లేదు' అని బుజం తట్టి వెళ్లిపోయాడు.

సూర్యానికి భోజనం సయించలేదు. పగంలో లేచి వచ్చాడు. గడపలో మంచుని తండ్రి మంచం వైపు చూశాడు. ఆశ్చర్యం వేసింది ! తన్ను తాను నమ్మలేకపోయాడు. కళ్లు పెద్దవిచేసి చూశాడు.

రామనాథం కళ్లనుండి అశ్రువులు ధారాపాతంగా వస్తున్నాయి.

కొన్ని రోజుల లేత పసిగుడ్డు ఏడుపుకు, ఇంత ప్రపంచం చూసి ఇన్ని కష్టసుఖాల అనుభవాలతో రాటుతేలిన, ఇన్ని జీవితాల అనుభవసారం, నీళ్లు కారిపోయింది.


తనదైన ప్రేమ తననుంచి వేరుకాదు—కాదు—కాదని తెలిసినా ఆ ఆలోచనే అశ్రువుల్ని కురిపించింది.


నిండు జీవితాన్ని అనుభవించి తృప్తిగా హాయిగా వెళ్లిపోతున్నానని మనసార విశ్వసించి దేవుడిచేయి అందుకోబోతూ కన్నీరుగా కరిగిపోతున్నాడు.

ఎందుకు? ?

ఈ జగత్తులోని వికాసానికి మూలమది. ★

అశోకా రాయల్ టాల్కం పౌడరు మరియు అశోకా స్నో




అధునిక వైద్య రసాయనాలతోబాటు
వేప రసాన్నికూడా
కలిగిన ఒకేఒక టూత్ పేస్టు !

ఇందువల్ల మీ నోరు ఎప్పుడూ తాజాగా వుంటుంది; చిగుళ్లు ఎల్లవేళలా ఆరోగ్యకరంగా వుంటాయి; దంతాలు తెల్లగా కాంతివంతంగా మెరుస్తాయి;
'నీమ్' ఉపయోగిస్తే, దంతక్షయం నివారింప బడుతుంది. ఎలాంటి క్రిములూ చేరవు ! దుర్వాసనకు తావు వుండదు !!

నీమ్ టూత్ పేస్ట్

ది కలకత్తా కెమికల్ కంపెనీ లిమిటెడ్

CNC-1-TEL